


## THE STORY OF A MAN, A WOMEN AND A CHILD

*( ప్రథమ ప్రచురణ - నవంబర్, 1988)*

## *(గత సంచిక తరువాయి)*

**బెనర్జీ ఆ తర్వాత మైత్రిని రెండుసార్లు కలిసాడు.** ఓసారి సుధీర్ జన్మనక్షత్రం తెలుసుకోడానికి. మరోసారి బర్త్ సర్టిఫికెట్ తీసుకోడానికి. బర్త్ సర్టిఫికెట్‌లోని తల్లి పేరు ఎదురుగా మైత్రి బదులు ధాత్రి రాసి ఉండటం గమనించి అడిగాడు ఆశ్చర్యంగా.

"మీ చెల్లెలు పేరుందే?"

"మేం కవలలం కదా. నన్నునుకుని మా చెల్లెల్ని డాక్టర్ 'నీ పేరు ఏమిటి' అని అడిగితే అది ధాత్రి అని చెప్పింది. అదే నాపేరనుకున్నాడు డాక్టర్. ఆలస్యంగా చూసుకున్నాం, స్కూల్‌లో చేర్పించేప్పుడు. అప్పుడు డాక్టర్ కానీ, జనన మరణ రిజిస్ట్రార్ కార్యాలయం వాళ్ళుకాని ఏం చేయలేమన్నారు. కోర్టుద్వారా ఆర్డర్ సంపాదించాలి మార్చాలంటే దానివల్ల ప్రత్యేక ప్రయోజనం లేదని, ముఖ్యంగా డబ్బు ఖర్చని నేను పట్టించుకోలేదు."

"ఒకందుకు ఇదీ మంచిదే. నీకు అనసూయ తెలుసు. మనిద్దరి పేర్లు తలిదండ్రుల పేర్లుగా దీనిమీద ఉండటం కాకతాళీయం అనుకోకపోవచ్చు. మరో పేరుంటే ఎలాంటి అనుమానం రాకపోవచ్చు" చెప్పాడు బెనర్జీ.

"అయితే ఆ పొరపాటు నీ మంచికే జరిగి వుంటుంది" నవ్వింది మైత్రి.

దత్తత ఇవ్వడానికి బెనర్జీ ఓ మిత్రుడితో మాట్లాడాడు. అతనందుకు అంగీకరించాడు. సుధీర్ తన దగ్గర అనాధగా పెరుగుతున్నాడని చెప్పడానికి తనకేం అభ్యంతరం లేదని చెప్పాడు. కాకపోతే తర్వాత పోలీసులు, కోర్టులులాంటి గొడవలు రావని హామీ ఇవ్వమన్నాడు.

"ఈ అబద్దం దేనికి? అసలా కుర్రాడెవరు?" అడిగాడతను.

"నిజంగా అనాధ. అయితే దత్తత తీసుకుంటే కానీ అది చెల్లుబాటుకాదు. అనాధ శరణాలయంలో పెరుగుతున్నాడు. అక్కడున్న వాళ్ళని మా ఆవిడ దత్తత తీసుకోడానికి అంగీకరించదు. అందుకని మీ దగ్గర పెరుగుతున్నాడన్న అబద్దం" అబద్దం ఆడాడు.

"అలాగే"

సుధీర్ గురించి, "అతని తండ్రిపేరు చక్రవర్తి కలరా వచ్చి పోయాడు. తల్లిపేరు ధాత్రి అనుకుంటా కలరాతో పోయింది. సరిగ్గా గుర్తులేదు. చక్రవర్తి కంప్యూటర్ ఇంజనీర్‌గా పనిచేస్తూండగా నా కొలీగ్, సుధీర్ తాత మా లెక్కల మాస్టారు.."

తను సృష్టించిన సుధీర్ బేక్ గ్రౌండ్‌ని వివరించాడు.

ఓ రోజు మైత్రి, బెనర్జీ సాయంత్రం పెరేడ్ గ్రౌండ్స్‌లో కలుసుకున్నారు.

"ఏమిటి? రమ్మని కబురు చేశావు?" అడిగాడు బెనర్జీ.

"నే చెప్పిన విషయాలన్నీ గుర్తున్నాయిగా?" అడిగింది మైత్రి.

"భాష పొరపాటు. విషయాలు కాదు. హెచ్చరికలను. గుర్తున్నాయి" నవ్వాడు.

"ఏనాడయితే మీ ఆవిడకి సుధీర్ నీ కొడుకని తెలుస్తే నీ గొంతుకు ఉరి ఆ రోజు నుంచి నెమ్మదిగా బిగుసుకుంటుంది. సవతి కొడుకు ఇంట్లో ఉండటం ఇష్టంలేని భార్యతో పడే బాధ అనుభవిస్తే కానీ అర్ధంకాదు. ఏ బోర్డింగ్ స్కూల్‌కో పంపినా ఆవిణ్ణి మోసం చేసినందుకు బాధపడక మానదు. ఈ సంగతి అనుక్షణం గుర్తుంచుకో" చెప్పింది.

"బెదరిస్తున్నావా?" అడిగాడు.

"భాష పొరబాటు. బెదిరింపు కాదు... హెచ్చరిక చేస్తున్నాను. అదీ నీ మంచికోరే. ఇండియలో ఎక్కణ్నించయినా సరే నేను జస్ట్ ఒకక్ పోస్ట్ కార్డ్ మీ ఆవిడకి పోస్ట్ చేస్తే చాలు. ఒక్క ఫోన్ చేస్తే చాలు"

"మా ఆవిడకి అలాంటి అసూయలు, ద్వేషాలు లేవు. జస్ట్ నీకు తెలియాలని చెపుతున్నానంతే. బోర్డింగ్ స్కూలులో ఇంగ్లీషు మీడియంలో ఊటీలో చదివింది. కల్చర్డ్ అండ్ సాఫిస్టికేటెడ్"

చిన్నగా నవ్వింది మైత్రి.

"మోసం చేసే బుద్ది నీకు ఈ జన్మలో పోదు. అనసూయ మొన్న సాయంత్రం ఇండోర్ ప్లాంట్స్ కొనుక్కు వచ్చింది కదా!" అడిగింది మైత్రి.

"అవును"

"వాటిని సెలెక్ట్ చేయడానికి నా సహాయం తీసుకుంది. చాలా విషయాలు మాట్లాడుకున్నాం. దత్తత గురించి కూడా ఆమె మనసేమిటో నాకు తెలిసింది"

తెల్లబోతూ చూసాడు బెనర్జీ.

"సుధీర్‌ని పంపించి పులిపాలు తెప్పించమని తలకి కట్టుకట్టుకుని పడుకుంటుంది జాగ్రత్త"

"అసలు అనసూయని మళ్ళీ ఎందుకు కలిశావు. వద్దన్నాగా ? యు ఆర్ ఏ స్కాండ్రల్" చెప్పాడు బెనర్జీ కోపంగా.

"థాంక్స్ ఫర్ ది కాంప్లిమెంట్. కాకపోతే నిన్ను డీల్ చేయగలిగేదాన్ని కాదు"

బెనర్జీ కోపంతో బుసలు కొట్టాడు.

చిన్నగా నవ్వింది మైత్రి.

"ఈ విషయం మనం మాట్లాడటం ఇదే ఆఖరిసారి. నేనెక్కడున్నా సరే నీ వ్యక్తిగత జీవితం ఎలా సాగుతోందో తెలుసుకునే ఏర్పాట్లు చేసుకునే వెళ్తున్నాను. ఐ కీప్ టేబ్స్ ఆన్ యువర్ హేబిట్స్, మైండ్ యు. ఇంకో సంగతి"

"ఇంకా?" అడిగాడు బెనర్జీ మైత్రి వెంటనే మాట్లాడక పోవడంతో.

"నీ కేపటలిస్ట్ బుద్దులు మాను. యూనియన్‌ని గుర్తించి అందర్ని మళ్ళీ ఉద్యోగాలకి తీసుకో. వర్కర్స్ వెల్‌ఫేర్ కోసం మీ నాన్నగారు ఎంత ఖర్చు చేస్తుండేవారో అంత ఖర్చు చెయ్యి. వాళ్ళ కడుపులు కొట్టి నువ్వు అర్జించి సుధీర్ కిచ్చి పోనక్కర్లేదు"

బెనర్జీ మొహం వెంటనే ఎర్రబడింది.

"నువ్వేవరనుకుంటున్నావు? ఆకాశంలోంచి ఊడిపడ్డ దేవత వనుకుంటున్నట్లు. నా ఉద్యోగం ఎలా చెయ్యాలో, వ్యాపారం ఎలా నడపాలో నాకు బాగా తెలుసు. కావాలంటే నిన్ను చేర్చుకుని జీతం పెంచమంటే పెంచుతాను. అంతకు మించి నేనేం ప్రామిస్ చేయలేను"

"ప్రామిస్‌లు కాదు నే కోరేది చర్య. ఎల్లుడి దత్తత కార్యక్రమంలో సుధీర్ ఉండాలంటే రేపు ఇవి జరిగితీరాలి. కేంటీన్‌లో మీ నాన్నగారి పీరియడ్‌లోలాగా సబ్సిడైజ్డ్ ఫుడ్ దొరకాలి. డ్రస్ అలవెన్స్ పెంచాలి. పెండింగ్‌లో ఉన్న వర్కర్స్ కాంపన్సేషన్ కేసులన్నీ సెటిల్

అవ్వాలి. ముఖ్యంగా మెషీన్‌లో పడి కుడిచేతి బొటనవేలు పోగొట్టుకున్న సీతయ్యకి, లంచ్ అవర్‌లో వర్కర్స్ కి రేడియో కార్యక్రమాలు వినిపించాలి. చదవడానికి తెలుగు, ఇంగ్లీషు దినపత్రికలు లంచ్ అవర్లో ఇవ్వాలి. ఇవన్నీ రేపు పునరుద్ధరింపబడాలి"

"బ్లాక్ మెయిల్" నవ్వింది.

మళ్ళీ చెప్పింది.

"కంపెనీ ప్రాఫిట్ అండ్ లాస్ అకౌంట్‌లో లాభం పెరగడం ఒకటే సంతృప్తి అనుకోకూడదు మిస్టర్ బెనర్జీ. విశ్వం జి.యం. అయాక నీకు అతను చేసిన హితబోధలన్నీ మనసులోంచి తుడిచేసెయ్. మీ నాన్నగారి పద్ధతులని అనుసరించు. నీ జీవితంలో ఓ చెడు అధ్యాయం ముగిసిందనుకుని దానికి ఫుల్‌స్టాప్ పెట్టి కొత్త అధ్యాయం మొదలుపెట్టు"

నిస్సహాయంగా చూసాడు బెనర్జీ. అతని కోపం అంతా నిస్సహాయతగా మారింది.

"అలా చేస్తే నీ వర్కర్స్ సంతోషిస్తే అది నీ కుటుంబానికే శుభం"

బెనర్జీ కిటికీలోంచి బయటికి చూసాడు.

"కారు స్టార్టు చెయ్యి. నన్ను మా ఇంటి దగ్గర డ్రాప్ చెయ్యి" చెప్పింది

"సుధీర్ ఎప్పుడు వస్తాడు? ఎల్లుండి ఉదయం తొమ్మిదిన్నరకి ముహూర్తం" చెప్పాడు బెనర్జీ.

"రేపు ఇదే సమయంలో ఇదే చోటికిరా. కలుసుకుందువుగాని"

బెనర్జీ కారు స్టార్ట్ చేసాడు. మైత్రి ఇల్లు చేరుకునేదాకా బెనర్జీ మౌనంగా ఉండిపోయాడు. మైత్రి దిగాక చెప్పాడు.

"సీ యూ టుమారో"

కారు కదిలాక బెనర్జీ కసిగా బయటకి చెప్పాడు.

"ఏమనుకుంటోంది? అత్తసొమ్ము అల్లుడు దానం చేయడమంటే ఇదే"

●●●

అనసూయ, బెనర్జీ తల్లి మొహాల్లో అతనెన్నడూ చూడని కొత్త కళని చూశాడు బెనర్జీ. అతని తండ్రిపోయాక మొదటిసారిగా బయటకి వెళ్ళింది బెనర్జీ తల్లి. డాక్టర్ దగ్గరకి తప్ప మరోచోటకి వెళ్ళలేనిదావిడ అప్పటిదాకా.

అనసూయ ఆవిడ వెళ్ళి పురోహితుడు చెప్పిన వస్తువులు స్వయంగా కొనుక్కొచ్చారు. వీడియో గ్రాఫర్‌ని మాట్లాడారు, ఆ శుభసందర్భాన్ని వీడియో తీయడానికి. ఫేక్టరీలో చక్కగా ఫోటోలు తీసే ఓ ఫోర్‌మెన్‌తో చెప్పారు స్టిల్ ఫోటోలు తీయాలని. ఫిలింకి కావలసిన డబ్బు ఇచ్చారు.

అతిథులకి భోజనం కోసం ఓ ఖరీదయిన హోటల్‌కి ఆర్డర్ ఇచ్చారు. మెనూని ఇద్దరూ కలిసి ఎన్నిక చేసారు. డెకరేషన్ లైట్స్ షామియానాలాంటి వాటితో పాటు ఇంటి గుమ్మాలన్నింటికీ మామిడాకు తోరణాలు కట్టించడంలాంటి చిన్న పనులని కూడా దగ్గరుండి చేయించారు.

ఇన్విటేషన్ కార్డులని వాళ్ళే డిస్ట్రిబ్యూట్ చేసారు. సుధీర్ ఆడుకోడానికి వెండి విజిల్, తినడానికి వెండి కంచం, గ్లాసు, స్పూన్స్ కొన్నారు.

"అబ్బాయి ఎలా ఉంటాడండి? నాకు ముందోసారి చూపించమంటే చూపించరే?" అడిగింది అనసూయ.

"ఈ రాత్రి చూపిస్తాను" చెప్పాడు బెనర్జీ.

"ఎలా వుంటాడు?"

"బావుంటాడు"

"మీలానా? నాలానా?" నవ్వింది.

"ఇద్దరిలా"

మర్నాడు వర్కర్స్ అందరికీ శలవు ఇచ్చారు. ఫేక్టరీ మూసేసారు. అందర్నీ ఆ కార్యక్రమానికి ఆహ్వానించాడు బెనర్జీ. ఫేక్టరీలో అంతా ఆ విషయాలే మాట్లాడుకుంటున్నారు.

త్రిభువన్‌ని పిలిపించి బెనర్జీ సస్పెండ్ చేసిన పీరియడ్‌కి జీతం ఇస్తూ పనిలోకి తీసుకున్నాడు. అదే రోజు త్రిభువన్‌తో వర్కర్స్ వెల్‌ఫేర్ కార్యక్రమాల గురించి చర్చించాడు. దానికి ఎంత బడ్జెట్ కేటాయించాలో చర్చలు జరిపాడు.

సుధీర్‌ని దత్తత తీసుకుంటున్న సందర్భంగా బెనర్జీ అవి తమకిచ్చిన బహుమతులని అనుకోసాగారు వర్కర్స్. ఆ విధంగా వాళ్ళింకా చూడని సుధీర్ మీద ఆసక్తి, ఆప్యాయత ఏర్పడ్డాయి అందరికీ.

దత్తత రోజు బోనస్ డిక్లేర్ చేస్తారన్న రూమర్, లేదా ఓ సంవత్సరం ఇంక్రిమెంట్లని ఇస్తారన్న రూమర్ ఫేక్టరీలో లేవదీసారు కొందరు. అంతా మర్నాడు జరగబోయే దత్తత కార్యక్రమం గురించే మాట్లాడుకోసాగారు.

సాయంత్రం మైత్రి ఇంటికి వచ్చారు త్రిభువన్ ఇతర వర్కర్స్, ఆమె బయటకి బయలుదేరబోతుంటే, వాళ్ళు ఎంతో సంతోషంగా ఒకో విషయం చెప్తూంటే మైత్రి అందర్నీ కంగ్రాట్యులేట్ చేసింది.

"బెనర్జీ స్వతహాగా మంచివాడు. విశ్వం ప్రోద్భలంవల్లే అలా అయాడు" చెప్పింది.

"రేపు శలవు. ఎల్లుండి నుంచి మీరు ఉద్యోగానికి రావచ్చు. స్టోర్ కీపర్ పోస్ట్ మీకే ఇస్తారనుకుంటున్నారు" చెప్పాడు త్రిభువన్ సంతోషంగా.

తల అడ్డంగా ఊపి చెప్పింది మైత్రి.

"ఊహు. నేను రేపు సాయంత్రం ఊరెళ్ళిపోతున్నాను"

"ఏ ఊరు?" ఆశ్చర్యపోయారు.

"బాంబే"

"మళ్ళీ ఎప్పుడు వస్తారు?"

"ఇక రాను"

"మరి ఈ ఉద్యోగం ?" అడిగాడు ఓ వర్కర్.

"అక్కడ వేరే ఉద్యోగం దొరికింది."

"అరెరె? చక్కటి ఫ్రెండ్ మీరు. వెళ్ళిపోతున్నారంటే బాధగా ఉంది. మీరుంటే మన యూనియన్‌కి కొండంత అండ అనుకున్నాను" దిగులుగా చెప్పాడు త్రిభువన్.

"తప్పదు. వెళ్ళాలి" చెప్పింది.

"రేపు ఎలా వెళుతున్నారు? బస్సా? రైలా?" అడిగాడు త్రిభువన్.

"రైల్లో ఇఫ్ యు ఎక్స్‌క్యూజ్ మి, నేను అర్జెంటుగా బయటకి వెళ్ళిరావాలి" చెప్పింది చేతి గడియారం వంక చూసుకుని.

"అలాగే. రేపు మన యం.డి ఇంటికి వస్తున్నారుగా?" అడిగాడు త్రిభువన్.

తల ఊపింది మైత్రి.

●●●

చేతి గడియారం వంక చూసుకున్నాడు బెనర్జీ. అయిదున్నరకి వస్తానంది మైత్రి. ఆరవుతోంది. అతని మనసులో సందేహాలు భయంకరంగా సాగుతూండగా దూరంనుంచే చూసాడు మైత్రిని.

ఒక్కతే వస్తోంది.

వెంటనే కారు బానెట్ మీంచి కిందకి దూకాడు.

"సుధీర్ ఏడీ?" అడిగాడు అనుమానంతో కూడిన భయంతో.

తన ప్రశ్నకి మైత్రి సమాధనం చెప్పేలోగానే మళ్ళీ ఇంకో ప్రశ్న అడిగాడు.

"కొంపతీసి మనసు మార్చుకున్నావా?"

"లేదు. అడుగో"

దూరంగా ఎర్రటి పూలచెట్టుకింద నిలబడ్డ సుధీర్‌ని చూపించింది. బెనర్జీ వెంటనే సుధీర్ వైపు పరుగెత్తి, ఆ పిల్లవాడి దగ్గరకి వెళ్ళి రెండు చేతులతో సుధీర్‌ని ఎత్తుకున్నాడు. గాల్లో గిర గిర తిప్పుతూ సుధీర్ బుగ్గలమీద ముద్దు పెట్టుకోసాగాడు.

తన రక్తం, తన మాంసం, తన ప్రాణం, తనలో ఓ భాగం తన కొడుకు.

"నాన్నా"

బెనర్జీ గుండె పొరల్లోంచి ఆప్యాయత తన్నుకు వచ్చింది. గొంతులో ఏదో అడ్డుపడ్డట్టుగా అయింది.

"నాన్న" మళ్ళీ పిలిచాడు సుధీర్.

"సుధీర్! నా కన్నా"

"నాన్నా"

వాళ్ళ కలయికని చూస్తున్న మైత్రికి కూడా గొంతులో ఏదో అడ్డుపడ్డ భావన. తన కోరిక ఫలించింది. తన ప్రయత్నం సఫలం అయింది. విజయం వల్ల కలిగే తృప్తితో పాటు, మరో ఆనందం కలిగింది ఆమెకి.

తండ్రీ కొడుకులిద్దరినీ కలిపిన ఆనందం.

"చెప్పేశావా?" అడిగాడు బెనర్జీ మైత్రి దగ్గరకి కొడుకుని ఎత్తుకువచ్చి.

"ఇకనుంచి అంకుల్ కాదు నాన్న అని చెప్పాను."

"రేపట్నుంచి మా ఇంట్లో ఉంటావా?" అడిగాడు బెనర్జీ సుధీర్‌ని.

"ఓ" జవాబు చెప్పాడు సుధీర్.

ఆ రాత్రి సుధీర్‌ని కొద్దిసేపు ఇంటికి తీసుకెళ్ళాడు బెనర్జీ.

ఆ కుర్రాడిని ఆపాదమస్తకం పరిశీలనగా చూసింది అనసూయ.

"ఎలా ఉన్నాడు?" అడిగాడు బెనర్జీ.

"మీలానే ఉన్నాడు. నాలాకాదు"

బెనర్జీ తల్లికి కూడా సుధీర్ నచ్చాడు. తర్వాత బయట కారులో వెయిట్ చేస్తున్న మైత్రి దగ్గరకి తీసుకెళ్ళాడు. ఇద్దరినీ ఇంటిదగ్గర డ్రాప్ చేసాడు.

ఇంటికి తిరిగి వచ్చాక చెప్పింది అనసూయ తన భర్తతో నవ్వుతూ.

"కొడుకుని ఎన్నుకుని మంచిపనే చేసారు"

"ఏం?"

"కొడుకంటే ఒక్క యువకుడి గురించే వర్రీ అవాలి. అదే కూతురు ఉన్న తలితండ్రులలో? ఊళ్ళోని అందరు యువకుల గురించి వర్రీ అవాలి. ఆడవాళ్ళ ఆందోళనకి ఆపదకి తేడా ఏమిటో తెలుసాండి? ఇరవై ఎనిమిదిరోజులు. మొదటి నెలకి, రెండో నెల మెన్సెస్‌కి తేడా పీరియడ్ అదేకదా?"

బెనర్జీ కూడా చిన్నగా నవ్వి చెప్పాడు.

"తెలివే"

తన భర్త ముందు ఆ విషయం మాట్లాడకుండా ఉండాల్సింది అనిపించింది ఆమెకి కాని అతను నవ్వేయడంతో తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది.

ఆ రాత్రి సుధీర్‌తో చెప్పింది మైత్రి.

"నిన్ను బెనర్జీ దత్తత తీసుకుంటున్నారు. నే చెప్పినవన్నీ గుర్తున్నాయిగా?" అదిగింది.

"ఓ. ఇకనుంచి బెనర్జీని నాన్న అని, అనసూయని 'అమ్మా' అని ఇంకా వాళ్ళింట్లో నాన్నగారి అమ్మని 'నానమ్మా' అని పిలవాలి. గొడవచెయకుండా చక్కగా చదువుకోవాలి. అల్లరి చెయ్యకూడదు. ముఖ్యంగా" ఆగాడు.

"ముఖ్యంగా..?" అడిగింది మైత్రి.

"బాంబేలో నీ గురించి, ఎవరి గురించీ మాట్లాడకూడదు. పాత విషయాలు అడిగితే అవి మాట్లాడటం నాకిష్టంలేదు అని చెప్పాలి. అంతేగా?" అడిగాడు సుధీర్.

"ఇంకోటి మర్చిపొయ్యావ్ దొంగా" చెప్పింది మైత్రి నవ్వి.

"ఏమిటి?"

"గుర్తుతెచ్చుకో"

"రావటంలేదు"

"ప్రతి శనివారం నాకో ఉత్తరం రాయాలి"

"ఆ...అవును. ప్రతీ శనివారం నీకో ఉత్తరం రాయాలి. నువ్వు నాకు ఫోన్ చేస్తూంటావు కదా?" అడిగాడు సుధీర్.

"తప్పకుండా"

"అమ్మా, నాన్న మంచివాడు కాదా?" అడిగాడు సుధీర్ కాసేపాగి.

"ఎవరన్నారు?"

"ఆ రోజు మనింటికి వచ్చినప్పుడూ నిన్ను కొట్టి గొంతు పిసికారు కదా?"

సుధీర్ కంట ఆ దృశ్యం పడకుండా ఉండాల్సింది అని అనేకసార్లు అనుకుంది మైత్రి.

"నువ్వు చెప్పింది నిజమే. అప్పుడు మంచయన కాదు. కానీ ఇప్పుడు చెడ్డతనం అంతా వదిలేసి మంచివారయ్యారు. అందుకే మంచి వాడయ్యేదాక నిన్ను వాళ్ళింటికి ఇంతదాకా పంపలేదు."

"మరి ఎప్పుడయినా నన్ను చూడటానికి వస్తుంటావా?" అడిగాడు సుధీర్.

"తప్పకుండా"

"అంతా వస్తారా?"

"ఓ అంతా వస్తాం. నేను, నిఖిల్, అంతా. నువ్వు కూడా శలవలకి బాంబే వస్తూండచ్చు. సరేనా. నేను రేపు వెళ్ళిపోతున్నాను."

"సరే. ఇప్పుడు నాకేం భయంలేదు" చెప్పాడు సుధీర్.

**(ఇంకా ఉంది)**

Post your comments

ప్రస్తుతం లభ్యమౌతున్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి